క్లుప్తంగా

దేవరగట్టులో భక్తిశ్రద్ధలతో పూజలు



దేవరగట్టులో పూజలందుకుంటున్న మాళ మల్లేశ్వరస్వామి

హొళగుంద: దేవరగట్టులో ఆదివారం మాళ మల్లేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామివారాన్ని పురస్కరించుకుని ఆలయాన్ని దర్శించుకోవడానికి ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. ఈ సందర్భంగా పూజారులు ఆలయంలోని మూల విరాట్‌లకు సుప్రభాతసేవ, రుద్రాభిషేకం, బండరార్చన, కుంకుమార్చన, అభిషేకాలు, మహామంగహారతి, నైవేద్య సమర్పణతో పాటు ఇతర పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఆస్పరి మఠంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

రేపు 'జగనన్న సురక్ష'

ఆస్పరి: మండలంలోని చిన్నహోతూరు, నగరూరు గ్రామాలలో ఈనెల 11వ తేదీన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాణెమ్మ ఆదివారం తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందేందుకు అవసరమయ్యే 11 రకాల ధ్రువ పత్రాలను ఉచితంగా అందజేయనున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

హంపలో..

మద్దికెర : మండల పరిధిలోని హంప గ్రామంలో ఈనెల 11వ తేదీ ఉదయం 10 గంటల నుంచి సచివాలయం కార్యాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నరసింహమూర్తి ఆదివారం తెలిపారు. అధికారులు నమోదు చేసుకున్న వారికి 11 రకాల ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా అందజేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

లింగంపల్లిలో ..

హొళగుంద: మండలంలోని లింగంపల్లి, సుళువాయి గ్రామాల్లో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రాధ తెలిపారు. 13న వందవాగిలి, కోగిలతోట, 18న గజ్జహళ్లి , మార్లమడికి, 20న హొళగుంద-1,2 సచివాలయాలు, 25న హొళగుంద-3, 4 సచివాలయాల్లో కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఆయా గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పత్తి పంటను దున్నేసిన రైతు



చిరుమాన్‌దొడ్డిలో పత్తి పంటను దున్నేస్తున్న రైతు చంద్ర

ఆస్పరి: వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఎదుగుదలలేని పత్తి పంటను ఆదివారం మండలంలోని చిరుమాన్‌దొడ్డి గ్రామానికి చెందిన రైతు దున్నేశాడు. ముందస్తు వర్షాలు వస్తాయనే ఆశతో చంద్రన్న బోరు కింద రూ.90వేలు పెట్టుబడితో 6 ఎకరాలలో పత్తిని సాగు చేశాడు. వర్షాలు పడకపోవడంతో బోర్లలో నీరు తగ్గిపోవడంతో, పత్తి ఎదుగుదల లోపించిందని, దీంతో పంటను దున్నేస్తున్నానని ఆవేదన వ్యక్తం చేశాడు. వర్షాలు వస్తే ప్రత్యామ్నాయంగా కందులు, సజ్జలు వేయనున్నట్లు తెలిపాడు. వర్షాభావంతో నష్టపోయిన తనకు ప్రభుత్వం ఆర్థిక సహాయం చేయాలని రైతు కోరాడు.

బిణిగేరిలో ప్రభోత్సవం



బిణిగేరిలో తిక్కతాత స్వామి ప్రభను లాగుతున్న భక్తులు

ఆస్పరి: మండలంలోని బిణిగేరి గ్రామంలో వెలసిన తిక్కతాత స్వామి ఆరాధన సందర్భంగా ఆదివారం స్వామి వారి ప్రభోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ప్రభోత్సవాన్ని స్వామి వారి ఆలయం నుంచి చివర వరకు, తిరిగి ఆలయం వరకు లాగారు. ఆలయంలో స్వామి వారికి గంగ, ఆకుపూజ, మంగళహారతులు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

రూ. 11 కోట్ల పంటల బీమా పరిహారం

ఆలూరు: వ్యవసాయ సబ్‌డివిజన్ 2022 ఖరీఫ్ కింద సాగుచేసిన రైతులకు వైఎస్సార్ పంటల ఉచిత బీమా పథకం ద్వారా రూ. 11,32,93,751 కోట్లు పరిహారం మంజూరైనట్లు ఆలూరు వ్యవసాయ సంయుక్త సంచాలకులు సునిత ఆదివారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ..రైతులు ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈఏడాది ఖరీఫ్ సీజన్ పంటలకు సాగుకు ఇంకా అవకాశం ఉందని చెప్పారు.

అమ్మ ఒడి.. ఆనందాల జడి

- వరుసగా నాలుగో ఏడాది నగదు విడుదల చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- తల్లుల వ్యక్తిగత ఖాతాల్లో సొమ్ము జమ
- ఇంటింటా వెల్లివిరిసిన ఆనందం



పత్తికొండలో బ్యాంకింగ్ సర్వీస్ పాయింట్‌లో అమ్మ ఒడి డబ్బు తీసుకునేందుకు వేచి ఉన్న తల్లిదండ్రులు

పత్తికొండ రూరల్ : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఏ ఒక్కరూ చదువులకు దూరం కాకుడదనే ఉద్దేశంతో అమ్మఒడి పథకానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగానే పిల్లలను బడికిపంపే ప్రతి పేద తల్లి ఖాతాలో ప్రతి ఏటా రూ.15వేలు జమ చేస్తున్నారు. వరుసగా నాలుగో ఏడాది కూడా నిధులు జమ కావడంతో ఇంటింటా ఆనందోత్సాహాలు నిండుకున్నాయి.

బ్యాంకింగ్ కేంద్రాలు కిటకిట

ఈ ఏడాదికి సంబంధించి జూన్ 28వ తేదీన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి నిధులను తల్లుల ఖాతాలో జమ చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా 29,233 మంది లబ్ధిదారులు ఉండగా 28,904 మంది ఈకేవైసీని వలంటీర్లు పూర్తి చేశారు. వీరందరికీ నగదు జమ చేశారు. కొందరి ఖాతాల్లో తొలిరోజే సొమ్ము జమ కాగా మిగిలిన వారికి వారోత్సవాల సందర్భంగా అమ్మ ఒడి సొమ్ము అకౌంట్లో పడ్డాయి. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గ పరిధిలోని పత్తికొండ, మద్దికెర, తుగ్గలి, క్రిష్ణగిరి, వెల్దుర్తి మండలాల్లోని పలువురికి సెల్‌ఫోన్ మెసేజ్‌లు రావడంతో బ్యాంకింగ్ సేవా కేంద్రాలు కిటకిటలాడాడుతున్నాయి.

నియోజకవర్గంలో అమ్మఒడి లబ్ధిదారుల వివరాలు

మండలం	మొత్తం	లబ్ధిదారులు ఈ-కేవైసీ పూర్తయిని	శాతం
పత్తికొండ	7357	7,274	98.87
మద్దికెర	3420	3,380	98.83
తుగ్గలి	6589	6,524	99.01
క్రిష్ణగిరి	5051	4,993	98.85
వెల్దుర్తి	6816	6,733	98.78
మొత్తం	29,233	28,904	98.75

అమ్మ ఒడితో పిల్లల చదువుకు భరోసా



నా కుమారుడు కుమారుడు అరుణ్‌స్వామి ఎస్‌వీ ఎయిడెడ్ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నాడు. కూతురు సహస్రని అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాం. అమ్మఒడి సొమ్ము పడినట్లు సెల్‌ఫోనుకు మెసేజ్ రావడంతో ఎంతో సంతోషమైంది. వ్యక్తిగత అకౌంటులో రూ.13వేలు జమ కావడంతో పిల్లల చదువు ఖర్చులకు ఎంతో ఉపయోగపడ్డాయి. అమ్మ ఒడి డబ్బులు రాకుంటే ఇబ్బందిగా ఉండేది. పిల్లల చదువుకు జగనన్న సొంత మామయ్యలా చేయూతనందిస్తుండటం మాకెంతో ఆనందదాయకం.

– హరిప్రియ, పత్తికొండ

పిల్లల చదువుకు ఎంతగానో ఉపయోగం



నా కుమారుడు యు.ధీరజ్ 3వ తరగతి, కుమార్తె యు.గీత 2వ తరగతి చైతన్య స్కూల్‌లో చదువుతున్నారు. అమ్మఒడి సొమ్ము వ్యక్తిగత అకౌంటులో రూ.13వేలు జమ కావడంతో ఇద్దరు పిల్లలకు ఫీజులు, నోటు పుస్తకాలు, పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, బ్యాగులు కొనుక్కోడానికి ఎంతో ఉపయోగపడ్డాయి. అమ్మ ఒడి డబ్బులు రాకుంటే ఇబ్బందిగా ఉండేది. పిల్లల చదువుకు చేయూత నిస్తున్న జగనన్నకు కృతజ్ఞతలు.

– ఉప్పర రాధ, పత్తికొండ

ప్రభుత్వ చేయూత ఆనంద దాయకం



నా ఇద్దరు పిల్లలను పదోతరగతి వరకు ప్రభుత్వ పాఠశాలలోనే చదివించాం. కుమార్తె సాయిశ్రీకి మంచి మార్కులు రావడంతో ఇంటర్మీడియెట్ కర్నూలు నారాయణ కళాశాలలో చేర్పించాం. ప్రస్తుతం ఎంపీసీ సెకెండియర్ చదువుతుంది. కుమారుడు సాయిసిద్ధార్థ పత్తికొండ ప్రభుత్వ హైస్కూల్‌లో 10వతరగతి చదువుతున్నాడు. అమ్మఒడి రావడంతో కుమార్తె కాలేజీ ఫీజు, కొడుకు ట్యాషన్ ఫీజు చెల్లించాం. పిల్లల చదువుకు ప్రభుత్వ ఎంతగానో చేయూతనిస్తుంది.

– సరోజ, పత్తికొండ

ముమ్మరంగా 'నాడు-నేడు' పనులు



ఆస్పరి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో కొనసాగుతున్న కొత్త భవన నిర్మాణ పనులు

ఆస్పరి: మండలంలోని పాఠశాలల్లో నాడు- నేడు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మండలంలోని 31 పాఠశాలల్లో వివిధ రకాల మరమ్మతు పనులతో పాటు కొత్త భవనాల నిర్మాణాల కోసం ప్రభుత్వం రూ. 5కోట్లు మంజూరు చేసినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నరేష్ తెలిపారు. ఆస్పరి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో రూ. 26లక్షలతో రెండు కొత్త భవనాలను నిర్మిస్తున్నారు. మండలంలో ఆస్పరితో పాటు అట్టికల్లు, బైలుపత్తికొండ, బిణిగేరి, దొడగొండ, గార్లపెంట, హలిగేర, ఐనకల్లు, జొహరాపురం, కలపరి, కారుమంచి, ములుగుందం, నగరూరు, పలకూరబండ, పుష్పాలదొడ్డి, తురువగల్లు, వలగొండ. వెంగళాయిదొడ్డి, యాటకల్లు, ముత్తుకూరు, తొగలుగల్లు, బిల్లేకల్లు, చిన్నహోతూరు, కైరుప్పల, కేజీబీవీ, చిగళి పాఠశాలల్లో 68 శాతం వరకు పనులు జరిగాయని ఏఈ చెప్పారు. తర్వలోనే అన్ని పాఠశాలల్లో వంద శాతం పనులు పూర్తి చేస్తామన్నారు.

ఉద్యాన పంటలపై దృష్టి సారించాలి



రైతులకు మొక్కలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ వీరస్వామి, ఏపీఓ శ్రీనివాసులు,

నందవరం: రైతులు ఉద్యాన పంటలపై దృష్టి సారించాలని గ్రామ సర్పంచ్ వీరస్వామి, ఏపీఓ శ్రీనివాసులు సూచించారు. ఆదివారం మండల పరిధిలోని గురజాల గ్రామంలో రైతులకు కొబ్బరి, పండ్ల మొక్కలను పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ.. ప్రభుత్వంఉద్యాన పంటల పెంపకంపై 100 శాతం సబ్సిడీ అందిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉద్యాన పంటల ద్వారా రైతులకు ఆదాయం పొంది అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఉపాధి సిబ్బంది ఉద్యాన పంటలపై రైతులను ప్రోత్సహించి, గ్రామాల్లో అవగాహన కల్పించాలని సూచించారు. మండలంలో ఇప్పటి వరకు 3,000 మొక్కలను రైతులకు అందించామని ఏపీఓ తెలిపారు. కార్యక్రమంలో టీఏలు జయమణి, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

'ఈ తరం బాలలు' పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణలో పాల్గొన్న సాహితీ వేత్తలు

ఎమ్మిగనూరుటౌన్: కంబదహల్ ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేస్తున్న గణిత ఉపాధ్యాయుడు, బాలసాహిత్య వేత్త గద్వాల సోమన్న రచించిన 37వ పుస్తకం ఈతరం బాలలు, బాల గేయాలు పుస్తకాన్ని హైదరాబాద్‌లోని సారస్వత పరిషత్‌లో ఆదివారం ప్రముఖుల ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. బాలగేయాల సంకలనం అంతర్జాతీయ శ్రీ కళావేదిక చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్, కర్నూలు జిల్లా వినియోగదారుల ఫోరం జడ్జి నరహరి నారాయణ రెడ్డి, ఏఎల్ కృష్ణారెడ్డిల చేతుల మీదుగా ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో కేశవయ్య, నాగేశ్వరరావు, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

రూపుదిద్దుకున్న అభయాంజనేయుడు



వెల్దుర్తి హైవే వద్ద రూపుదిద్దుకున్న అతిపెద్ద అభయాంజనేయస్వామి విగ్రహం

వెల్దుర్తి: హైవే 44 పక్కన కర్నూలు వైపు వెల్దుర్తి ఎంట్రన్స్‌లో నిర్మాణం ప్రారంభించిన అతిపెద్ద (51 అడుగులు) అభయాంజనేయస్వామి విగ్రహం తుది రూపు దిద్దుకుంది. కిలోమీటర్ల దూరం నుంచి స్వామి భక్తులకు అభయమిస్తూ దర్శనమిస్తున్నాడు. శిల్పకారుల నైపుణ్యానికి ప్రతిరూపంగా చూపరులను కట్టిపడేస్తున్నాడు. 2019 నవంబరులో గురుస్వామి చెరుకులపాడు కళ్లమడి చినరామాంజనేయులు మొక్కవోని పట్టుదలతో, భక్తుల సహకారంతో నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. దాదాపు రూ.కోటిన్నర అంచనాతో స్థానిక ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, కుటుంబీకుల సహకారం, దాతల విరాళాలు అదించినా విగ్రహ నిర్మాణం అంచనా వ్యయం దాటిపోయింది. విగ్రహ పాదప్రాంతం చేరుకునే మెట్లు, ముఖ్యంగా ఆంజనేయస్వామి గుడి నిర్మాణం జరగాల్సి ఉంది. మరో రూ.కోటి రూపాయల వరకు పనుల అంచనా ఉందని, దాతలు మరింత సహకరించాలని నిర్మాణ కర్త (సెల్, ఫోన్ పే నంబర్: 9550076756) రామాంజనేయులు కోరుతున్నారు.

గ్రామసభలు సమర్థవంతంగా నిర్వహించాలి

ఆదోని అర్బన్ : గ్రామాల్లో నెలకొన్న సమస్యలు, పరిష్కార మార్గాలు, అభివృద్ధి పనులు తదితర వాటిపై కేంద్రం విడుదల చేసిన మార్గదర్శకాల ప్రకారం అధికారులు ప్రతి నెల పల్లెల్లో గ్రామసభలు నిర్వహించి ప్రజల నుంచి సలహాలు, సూచనలు, వారి అభిప్రాయాలు తీసుకోవాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు, న్యాయవాది శ్రీధర్ కోరారు. ఆదివారం పట్టణంలోని ఓ హోటల్‌లో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అధికారులు గ్రామాల్లో గ్రామసభలను సమర్థవంతంగా నిర్వహించాల్సి ఉండగా.. పలుచోట్ల తూతూ మంత్రంగా ముగిస్తున్నారన్నారు.

నేడు పౌరాణిక నాటకం

ఆదోని అర్బన్: సుల్తాన్‌పురం గ్రామంలో సోమవారం షేక్షావలితాత దర్గా ఉరుసు సందర్భంగా నవమాంకముల అనే పౌరాణిక నాటకం నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు ఆదివారం తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ యువ నాయకులు జయమనోజ్‌రెడ్డి, చంద్రకాంత్‌రెడ్డి హాజరవుతారన్నారు. అలాగే కళాకారులు శ్రీలక్ష్మణయాదవ్, శేఖర్, గోవింద్, నల్లారెడ్డి రాయుడుస్వామి, రవిప్రకాష్, రామన్నగౌడ్, గిడ్డయ్య పాల్గొంటారని చెప్పారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతికి సంతాపం

ఆలూరు రూరల్: మండలంలోని మొలగవల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ కార్యకర్త నబిరసూల్ (70) (అంధుడు) ఆదివారం ఉదయం అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి జయరాం సోదరుడు దేవరగట్టు ఆలయ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు గ్రామానికి వెళ్లి నబిరసూల్ మృతికి సంతాపం తెలియజేశారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి మట్టి ఖర్చులకు రూ.10 వేల నగదు అందించారు. బాధిత కుంటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ ఈరన్న గ్రామ నాయకులు లక్ష్మిరెడ్డి, కిష్టప్ప, గోవిందు, హరేరాం ఉన్నారు.

ఆలయ నిర్మాణానికి మంత్రి రూ.లక్ష విరాళం



విరాళాన్ని ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులకు అందజేస్తున్న మంత్రి గుమ్మనూరు జయరాం

ఆలూరు: మండలంలోని కమ్మరచేడు గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ కాడ సిద్ధేశ్వరస్వామి ఆలయానికి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం రూ.లక్ష విరాళం అందజేశారు. స్థానిక మంత్రి నివాసంలో శనివారం ఆలయ నిర్వాహకులకు నగదును అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పల్లె ప్రగతికి నాందిగా నిలిచిన ప్రభుత్వం నాలుగేళ్ల కాలంలో ప్రతి గ్రామ సచివాలయం పరిధిలో జరిగిన అభివృద్ధి పనులపై ప్రజలకు వైఎస్సార్‌సీపీ నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు అవగాహన కల్పించాల్సిన బాధ్యత తీసుకోవాలన్నారు. నియోజక వర్గంలో వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు, ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచ్‌లు, సింగిల్ విండో అధ్యక్షులు , డైరెక్టర్లు, దేవాలయ కమిటీ చైర్మన్లు, వ్యవసాయసలహా మండలి చైర్మన్లు తదితరులు ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు తమ వంతుగా కృషి చేయాలన్నారు. అనంతరం ఆలయ కమిటీ నిర్వాహకులు, వైఎస్సార్‌సీపీ నాయకులు వీరభద్రారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, అనిల్‌రెడ్డి, బసవరాజ్‌స్వామి, రాజశేఖర్‌రెడ్డి, వీరభద్రి తదితరులు మంత్రిని సన్మానించారు.

రైతన్నకు అండగా సీఎం వైఎస్ జగన్



మాట్లాడుతున్న గుమ్మనూరు ఈశ్వర్

హొళగుంద: కష్ట కాలంలో కూడా నేనున్నాని భరోసా ఇస్తూ రైతులను ఆదుకుంటున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనని కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం తనయుడు ఈశ్వర్ అన్నారు. ఆదివారం హొళగుందలో జరిగిన ఓ వివాహ వేడుకకు దేవరగట్టు ఆలయ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు తనయుడు మహేంద్రతో కలిసి హాజరయ్యారు. అనంతరం స్థానిక నాయకులతో సమావేశమయ్యారు. వారు మాట్లాడుతూ.. ప్రజలు గత ప్రభుత్వాలు, నేడు జగనన్న ప్రభుత్వ పాలనను బేరీజు వేసుకొని ఎవరు మంచి చేశారో ఆలోచించి ఓట్లు వేయాలని కోరారు. గ్రామపెద్ద రాజ పంపన్నగౌడ్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఈశా, సింగిల్ విండో చైర్మన్ మల్లికార్జున, కోగిలతోట శేషప్ప, ఎస్కే గిరి తదితరులు ఉన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

హాలహర్వి: మండలంలోని ఎల్ఎల్‌సీ కెనాల్ వద్ద అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని గుర్తించి పట్టుకున్నట్లు సీఐ వెంకటేశ్వర్లు ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ మాచనూరు గ్రామానికి చెందిన దలవాయి విజయ కుమార్ ఆటో నం ఏపీ21వై 7570 లో 10 బాక్సులలో 960 ఒరిజినల్ చాయిస్ విస్కీ టెట్రా ప్యాకెట్లు అక్రమంగా తరలిస్తుండగా అరెస్టు చేసి, కేసు నమోదు చేశామన్నారు. హెడ్ కానిస్టేబుల్ గిడ్డయ్య గౌడు, గోవర్ధన్, అయన్నస్వామి తదితరులు పాల్గొన్నారు.

బావి పూడ్చివేత



పూడ్చకముందు ప్రమాదకరంగా వున్న బావి



పూడ్చిన తరువాత ఇలా..

మద్దికెర : మండల కేంద్రమైన మద్దికెరలో బసవన్న గుడి వీధిలో ఉన్న దిగుడు బావి 40 ఏళ్ల క్రితం ఎండిపోయి నిరుపయోగంగా మారింది. ఇందులో స్థానికులు చెత్త వేయడం, ప్రమాదకరంగా మారడంతో పూడ్చివేయాలని కాలనీ వాసులు కార్యాలయాల చుట్టూ తిరిగినా ఎవరూ పట్టించుకోలేదు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ఆ కాలనీలో పర్యటించిన సమయంలో ప్రజలకు సమస్యను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆదేశించడంతో మండల నిధులతో ఎంపీపీ అనితాయాదవ్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసులు బావిని వెంటనే పూడ్చివేయించారు. దీంతో కాలనీవాసులతో పాటు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత పాలకులు ఎన్నికలు వచ్చినపుడు మాత్రం హామీ ఇచ్చారని తరువాత పట్టించుకున్న పాపన పోలేదన్నారు. ఎమ్మెల్యే శ్రీదేవి దృష్టికి తీసుకెళ్లిన వెంటనే పరిష్కరించడం ఆనందంగా వుందన్నారు.

హిందూ ధర్మాన్ని చాటిచెప్పాలి

ఆదోని అర్బన్ : హిందూ ధర్మాన్ని చాటి చెప్పాలని విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు బసవన్న గౌడ్, గుంతకల్ నాయకుడు రామ్మూర్తి సూచించారు. స్థానిక కార్యాలయంలో సంఘం జిల్లా సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ సేవా కార్యక్రమాలు విస్తృతం చేయాలని, వచ్చే ఏడాదికి వీహెచ్‌పీ ఏర్పాటు చేసి 75ఏళ్లు అవుతున్న సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. జిల్లా కార్యదర్శి హనుమంతరెడ్డి, ఉపాధ్యక్షుడు ఆంజనేయులు, జిల్లా కోశాధికారి పంపాపతి, భజరంగదళ్ అధ్యక్షుడు రవిశంకర్, నగర అధ్యక్షుడు వీరన్న, ఉపాధ్యక్షుడు చిన్నబసప్ప, కార్యదర్శి నారాయణసింగ్ పాల్గొన్నారు.

నేడు కటారుకొండలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

కృష్ణగిరి: మండల పరిధిలోని కటారుకొండలో సోమవారం సాయంత్రం 4 గంటలకు పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని ఆయన కోరారు.

ఆర్థిక సాయం

పత్తికొండ రూరల్: స్థానిక చింతకాయలవీధిలో కరణం రంగన్న (85) ఆదివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు పోచిమిరెడ్డి మురళీధర్‌రెడ్డి మృతదేహానికి పూల మాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం దహన సంస్కారాలకు రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు. తమ సంస్థ సేవాదళ్ కుటుంబ సభ్యుల్లో ఎవరు మృతి చెందినా వారి దహన సంస్కారాలకు రూ.5వేలు ఇస్తామని చెప్పారు. ఆయన వెంట మాజీ ఎంపీటీసీ గణపతి, వార్డు సభ్యుడు లైట్‌నాగరాజు, సేవాదళ్ సభ్యులు ఉన్నారు.

సీఐపై చర్యలు తీసుకోవాలి

ఎమ్మిగనూరురూరల్: పట్టణ పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదులు చేయటానికి వచ్చిన వారిపట్ల దురుసుగా ప్రవర్తిస్తున్న టౌన్ సీఐపై చర్యలు తీసుకోవాలని పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి అల్లాబకాష్, జిల్లా కార్యవర్గసభ్యులు గణేషులు పేర్కొన్నారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలోని జరిగిన వివిధ సంఘటనలో బాధితులు ఫిర్యాదు చేయటానికి పోలీస్‌స్టేషన్‌కు వస్తే కేసు నమోదు చేయకుండా ప్రత్యర్థులతో రాజీ కావాలని ఒత్తిడి తీసుకొస్తున్నారని ఆరోపించారు. జిల్లా అధికారులు స్పందించి సీఐపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు.

వెయిట్ లిఫ్టర్లకు శిక్షణ

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో వెయిట్ లిఫ్టర్లకు ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి సహకారంతో త్వరలో శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మాజీ వెయిట్‌లిఫ్టర్లు మాచాని శివకుమార్, దేవరాజ్, వెంకన్న ఆదివారం తెలిపారు. ఇటీవల ఎమ్మెల్యేను మాజీ వెయిట్‌లిఫ్టర్లంతా కలిసి సన్మానించగా, పట్టణంలో వెయిట్‌లిఫ్టర్లకై నాలుగు సెంట్ల స్థలాన్ని కేటాయిస్తామని ఆయన హామీ ఇచ్చారన్నారు. అదేవిధంగా వెయిట్ లిఫ్టింగ్ సామగ్రిని కూడా సమకూర్చుతా మని చెప్పారని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు వెయిట్‌లిఫ్టర్ల తరఫున ధన్యవాదాలు తెలిపారు.

ప్రశాంత జీవనాన్ని గడపండి

కృష్ణగిరి: గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించకుండా ప్రశాంత జీవనాన్ని గడపాలని ఎస్‌ఐ చంద్రశేఖర్‌రెడ్డి గ్రామస్తులకు సూచించారు. మండల పరిధిలోని చుంచుఎర్రగుడి గ్రామంలో ఆదివారం ఆయన గ్రామస్తులకు పలు సూచనలు చేశారు. గ్రామంలో ఎవరికైనా సమస్యలు వస్తే వెంటనే స్టేషన్‌ను సంప్రదించాలని, అలా కాకుండా పంతాలు పట్టింపులకు పోతే చర్యలు తప్పవన్నారు. ముఖ్యంగా రహదారి ప్రమాదాల పట్ల ప్రతిఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణం చేసినా, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ లేకుండా వెళ్లితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

రైతు బజార్ ఏర్పాటు చేయాలి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో రైతు బజార్‌ను ఏర్పాటు చేయాలని సీపీఐ జిల్లా నాయకులు పంపన్నగౌడ్, పట్టణ కార్యదర్శి రంగన్న డిమాండ్ చేశారు. సీపీఐ ఆధ్వర్యంలో టమాట, పచ్చి మిర్చి కొనుగోలు చేసి పట్టణంలో సబ్సిడీపై ప్రజలకు అందించాలని, ఇందుకోసం రైతు బజార్ ఏర్పాటు చేయాలని కోరుతూ ఆదివారం పట్టణంలో కూరగాయలతో నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ కూరగాయలు పెరగడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రూ.1.30లక్షల జనాభా కల పట్టణంలో రైతు బజార్ లేకపోవడం శోచనీయమన్నారు.

గాయపడిన మహిళ మృతి



లలిత (ఫైల్)

నందవరం : మండల పరిధిలోని జొహరాపురం గ్రామంలో శనివారం సాయంత్రం విద్యుత్ స్తంభాలు విరిగిపడి మహిళకు గాయాలైన విషయం తెలిసిందే. గాయపడిన మహిళ లలిత(38) కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి మృతి చెందింది. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు శోక సంద్రంలో మునిగిపోయారు. ఆదివారం డాక్టర్లు పోస్టుమార్టం నిర్వహించి మృతదేహన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతి చెందిన లలితమ్మకు భర్త నాగిరెడ్డి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. విద్యుత్ అధికారులు ఆదుకోవాలని కుటుంబ సభ్యులు కోరారు.

నేడు తహసీల్దార్ కార్యాలయంలో 'స్పందన'

కృష్ణగిరి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం ఉంటుందని తహసీల్దార్ పురుషోత్తం ఆదివారం తెలిపారు. కార్యక్రమానికి మండలస్థాయి అధికారులందరు తప్పక హాజరుకావాలన్నారు. ప్రజలు తమ సమస్యలపై అర్జీలు అందజేస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సద్వినియోగం చేసుకోండి

కర్నూలు(సెంట్రల్): ప్రధానమంత్రి కౌశల్ యోజన పథకాన్ని విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ కుటుంబాలు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర అర్టిసన్ సెల్ కన్వీనర్ కొండముడి బంగారుబాబు సూచించారు. ఆదివారం కర్నూలు పర్యటనకు వచ్చిన ఆయన నగరంలోని వినాయక ఘాట్‌లో విశ్వ బ్రాహ్మణ, విశ్వ కర్మలను కలుసుకున్నారు. ప్రధానమంత్రి కౌశల్ యోజనను సద్వినియోగం చేసుకోవడంతో కలిగే ప్రయోజనాలను వివరించారు. అంతకుముందు పథకానికి ఎలా దరఖాస్తు చేసుకోవాలో.. ఎలా లబ్ధి పొందాలో క్షుణ్ణంగా వివరించారు. సోమేశ్వర ఆచారి, దేవపూజ ధనుంజయాచారి, బ్రహ్మయ్య ఆచారి పాల్గొన్నారు.